# సింగిల్ పేజీ కథలు

## డిటెక్టివ్

**ఫస్ట్ షో చూసి ఇంటిదారి పట్టాడు మూర్తి.**

**మూర్తికి సినిమాల పిచ్చి ఎక్కువ. డిటెక్టివ్ పిక్చర్స్ అంటే విపరీతమైన మోజు. సినిమాకు వెళ్లాలంటే నడచిపోవాల్సిందే. అయినాసరే నచ్చిన సినిమా వచ్చిందంటే చాలు పట్నానికి వెళ్తూనే వుంటాడు మూర్తి.**

''ఒరేయ్ మూర్తీ! సినిమాలు చూస్తే ఏమొస్తుందిరా. ఏదైనా పనీ పాట చేసి మీ నాన్నకు చేదోడుగా వుండొచ్చుకదా. ఎన్నాళ్లిలా జులాయిలా తిరుగుతావు'' చాలామంది అంటూనే వుంటారు.

'సినిమాలో హీరోలా లేను కూడా గొప్ప డిటెక్టివ్‌నవుతా. ఏదైనా రహస్యాన్ని ఛేదిస్తా. అప్పుడు తెలుస్తుంది ఈ మూర్తిది అల్లాటప్పా బుర్ర కాదని' అనుకుంటూ వుండేవాడు మూర్తి.

పట్నం నుండి వూరికి అడ్డదారి వుంది. నలుగురైదుగురు తోడవ్వందే రాత్రిపూట ఆ దారిలో ఎవరూ వెళ్లరు. డిటెక్టివ్ పిక్చర్ చూసిన సంబరంలో, దారిలో ఎవరైనా కలుస్తారులే అనే ధీమాతో అడ్డదారిన బయలుదేరాడు మూర్తి. దారిలో ఎవరూ కలవలేదు. గుండెలు బిగపట్టుకొని వేగంగా నడుస్తున్నాడు.

ఏదో దడ, దడ శబ్దం తనవైపే వస్తున్నట్లు వినపడుతోంది. పై ప్రాణాలు పైనే పోయినంత పనయింది. నిదానించి ముందుకు చూశాడు. ఎవరో సైకిల్ పై వేగంగా వస్తున్నారు. 'ఇదేదో దయ్యం కాదు కదా' చెట్టు చాటున నక్కి కూర్చున్నాడు మూర్తి. దగ్గర్లోనే సైకిలు ఆగింది. ఏదో ఒక మూటను పక్కనున్న ముళ్లపొదల్లోకి విసిరి వచ్చినంత వేగంగా వెళ్లిపోయాడా మనిషి.

చీకట్లో ముఖం కనపడలేదు. అయినా ఈ వేళప్పుడు మూటను తెచ్చి ముళ్లపొదల్లోకి విసిరి వేయవలసిన అవసరం ఏమిటి? ఇందులో ఏదో రహస్యముంది. అదేదో కనిపెట్టాలనుకున్నాడు మూర్తి.

భయంతో కాళ్లు చేతులు వణుకుతున్నాయి. కర్తవ్యం గుర్తుకొచ్చింది. డిటెక్టివ్‌లా ఈ రహస్యాన్ని ఛేదించాలి. అందరూ అనుకుంటున్నట్లు ఈ మూర్తి చేతకాని దద్దమ్మ కాదని నిరూపించాలి. ధైర్యాన్ని కూడగట్టుకొని మెల్లగా ముళ్లపొదలవైపు అడుగేశాడు.



'వాసన వస్తోంది. సంచిపై అక్కడక్కడా నల్లగా వున్నట్లనిపిస్తోంది. బహుశా రక్తపు మరకలు కావచ్చు. అంటే ఇదేదో కచ్చితంగా శవమే. ఎవరినో చంపి మూటలోకట్టి ఇలా పారవేసినట్లున్నారు. వాసన వేస్తుందంటే రెండు మూడు రోజుల క్రితమే ఈ హత్య జరిగిందన్నమాట. పరిశోధన చేసి అసలు దోషులెవరో కనిపెట్టేస్తే పుణ్యం, పురుషార్థం దక్కినట్లవుతుంది' హుషారుగా బయలుదేరాడు మూర్తి.

''రెండు మూడు రోజులుగా మన వూళ్లో ఎవరైనా కనిపించకుండా పోయారా'' అంటూ కనపడిన వారందరిని అడగడం మొదలుపెట్టాడు.

''గోనె సంచిలో శవం- అడ్డదారిలో ముళ్ల చెట్ల పొదల్లో వుంది. శవం కుళ్లిపోయి వాసన వస్తోంది. ఎలాగైనా దోషులెవరో కనిపెట్టేస్తా..నా తెలివి ఏపాటిదో మీకు చూపిస్తా'' అందరితోను ఇదే మాట చెప్పాడు మూర్తి.

ఉదయమే కొంతమంది యువకులు అడవికి వెళ్లారు. ''నిజమే వాసన వస్తోంది. అయినా మనకెందుకులే లేనిపోని గొడవ'' అనుకుంటూ దూరం నుండే గోనెసంచిని చూసి వచ్చారు. ''మనమేమో అనుకున్నాంగాని మూర్తి ధైర్యస్థుడే. అతడు చెప్పింది నిజమే'' అన్నారు. గర్వంతో కాల రెగరేశాడు మూర్తి.

అయితే ఏం లాభం? ఎంత ప్రయత్నించినా ఎవరు ఎవరిని చంపారో తెలుసుకోలేకపోయాడు.

''ఈ విషయంలో పోలీసువారి సాయం తీసుకుంటే నా పని తేలిక అవుతుంది'' కొత్త ఆలోచన చేశాడు మూర్తి.

''సార్ నా పేరు మూర్తి. ఎలాగైనా డిట్టెక్టివ్ కావాలని నా కోరిక. మీకు గోనె సంచిలో వున్న శవాన్ని చూపిస్తా. అది ఎవరిదో మీరు తేల్చితే, ఆ హత్య ఎలా జరిగిందో, ఎవరు చేశారో నేను కనిపెట్టేస్తాను. నాకీ సాయం చేసి పుణ్యం కట్టుకోండి'' పోలీస్ స్టేషనులో ఎస్.ఐ.తో వివరాలన్నీ చెప్పాడు.

పోలీసు బలగంతో బయలుదేరాడు మూర్తి. అప్పుడే తాను డిట్టెక్టివ్ అయినట్లు, ఇంటిముందు డిట్టెక్టివ్ అని బోర్డు పెట్టినట్లు వూహల్లో తేలిపోయాడు మూర్తి. విషయం తెలిసిన చాలామంది అక్కడికి చేరుకున్నారు.

''ఇంత వాసన వస్తుందేమిటబ్బా'' అందరూ ముక్కులు మూసుకున్నారు.

శవం ఎవరిదో... అందరిలోను ఒకటే ఉత్కంఠ.

మూట విప్పాడు కానిస్టేబుల్. ముందుగా కాళ్లు బయటపడ్డాయి. ఇవేంటి కోడికాళ్లులా వున్నాయే అనుకుంటూ బయటికి లాగాడు కానిస్టేబుల్. చచ్చి వాసన పట్టిన కోడిపుంజు అది. ఆశ్చర్యంతో సంచిని గుమ్మరించారు. కాళ్లు, తలలు, ఈకలు, కోళ్లు ఒక్కటొక్కటిగా కిందపడ్డాయి. అన్నీ వాసన పట్టి వున్నాయి. ఎవరో కోళ్లఫారం వాళ్లు చనిపోయిన కోళ్లను ఇలా సంచిలో కట్టి పారవేశారు.

''ఏమయ్యా మూర్తీ! ఇందులో శవముందా? హత్య ఎలా జరిగిందో నువ్వు కనిపెడతావా. ప్రయివేట్ డిట్టెక్టివ్ బోర్డు పెడతావా. నీ కళ్లకు పోలీసులు ఎట్లా కనబడుతున్నారు. మర్యాదగా జీపు ఎక్కు.

స్టేషన్‌లో నాలుగు తగిలిస్తే నీ తిక్క వదులుతుంది'' అంటూ లాఠీతో రెండు దెబ్బలు వేశాడు ఎస్.ఐ.

''భలే డిటెక్టివ్‌రా'' అంటూ పొట్టచెక్కలయ్యేలా నవ్వసాగారంతా. వంచిన తల ఎత్తలేకపోయాడు మూర్తి.

''బాబూ వీడు నా సుపుత్రుడే. సినిమాల పిచ్చి వీడిని ఇలా చేయించింది. తప్పు క్షమించి వదిలేయండి సార్'' అంటూ ఎస్.ఐ.ను ప్రార్థించాడు మూర్తి తండ్రి.

''మీ తండ్రి ముఖం చూసి నిన్ను వదిలేస్తున్నా. ఇప్పటికైనా సినిమా పిచ్చి వదిలి మీ నాన్నకు తోడుగా వుండు. ఇంకోసారిలా చేశావో జైల్లో చిప్పకూడు తింటావు జాగ్రత్త'' అంటూ చీవాట్లు పెట్టి వదిలాడు ఎస్.ఐ.

బ్రతుకుజీవుడా అనుకుంటూ ఇల్లు చేరుకున్నాడు మూర్తి. ''మన మూర్తి డిటెక్టివ్ అయ్యాడురోయ్'' అందరూ ఎగతాళి చేస్తున్నారు.

''ఏరా డిటెక్టివ్! ఏమైనా కేసులున్నాయా'' అంటూ ఎప్పుడైనా ఎస్.ఐ. పలుకరిస్తే, ''మీ దయవల్ల వ్యవసాయం చేసుకుంటున్నా సార్'' వినయంగా అంటున్నాడు మూర్తి.

**-టి.రామాంజనేయులు (హాలహర్వి)**

# లవ్ లెటర్

**“చాకలి వచ్చింది. మీ రెండు జతలూ వేసేయమంటారా?” అడిగింది సుశీల తన భర్తని.**

**“జేబులో ఏవైనా కాగితాలూ, డబ్బులూ ఉంటే తీసి మరీ వెయ్యి” మంచం మీద దొర్లుతూనే చెప్పాడు భర్త సుబ్రమణ్యం.**

భర్త ఆదేశాలు పాటిస్తూ అన్ని కాగితాలు వెతికి- ''ఒక్క పైసా కూడా జేబుల్లో ఉంచరు కదా?'' అని గొణుక్కుంటూ చాకలికి వేసింది బట్టలని సుశీల.

సాధారణంగా అతని జేబులో ఉన్న కాగితాలని ఆమెకి చూసే అలవాటు లేదు. కానీ తీయంగానే మెరుస్తూ ఉన్న ఒక కాగితం మాత్రం ఆమెని ఆకర్షించింది. అది ఒక ఖరీదైన లెటర్ పాడ్‌లోంచి తీసిన కాగితం. ఏదో లెటర్‌లా ఉందే అనుకుంటూ చివర్లో ప్రేమతో సుకన్య...అన్న అక్షరాలు చూసేసరికి సుశీలకి గుబులు ప్రారంభమైంది. చదవడం ప్రారంభించింది. ఒక్కొక్క వాక్యం చదువుతూంటే ఆమె ముఖంలో రంగులు మారుతున్నాయి. తన భర్తకి ఇంకో స్త్రీ లెటర్ రాయడమూ, అదీ లవ్ లెటర్ కావడంతో ఆమె తట్టుకోలేకపోయింది.


రోజూ బెడ్‌కాఫీతోపాటు ముద్దు కూడా జత చేసి మరీ నిద్రలేపే సుశీల ఆరోజు తన దగ్గరికి రాకపోగా సుబ్రమణ్యం నిద్ర లేచేసరికి దాదాపు తొమ్మిది గంటలయ్యింది.

''ఏంటి డియర్...ఈరోజు నువ్వు బెడ్ కాఫీ తేలేదేం?'' వంట చేస్తున్న సుశీల నడుం చుట్టూ చేతులు వేస్తూ అడిగాడు భార్యని.

ఆమె విదిలించుకుని మాట్లాడకుండా వాష్ బేసిన్‌వైపు చూపింది.

అక్కడున్న బ్రష్, పేస్ట్ చేతిలోకి తీసుకుని బ్రష్ చేసి మిగతా కార్యక్రమాలన్నీ ఒక్కొక్కటిగా పూర్తిచేసి ఆఫీసుకని బయల్దేరుతున్నాడు సుబ్రమణ్యం. కానీ తన భార్య ఎందుకీ నిశ్శబ్దయుద్ధం జరుపుతోందో తెలియలేదు.

బయటికి నడవబోతూ ''ప్లీజ్ దయచేసి



మాట్లాడవూ? లేకుంటే ఈరోజు నేను ఆఫీసులో పని చేయలేను'' అంటున్న అతన్ని కోపంగా చూసింది ఆమె.

ఆమె కోపంలో రౌద్రం గ్రహించాడు. ''సుశీ...! నీ కోపానికి కారణం తెలీట్లేదు. కారణం చెప్పవూ'' అర్థించాడు.

ఆమె మరింత కోపాన్ని పెంచి ''సుకన్య ఎవరూ?'' అడిగింది.

అప్పుడు చూసుకున్నాడు ఆ లెటర్ జేబులోనే ఉంది. ''అదా నీ కోపానికి కారణం?'' అంటూ ఇంకో లెటర్ భామ నుండి వచ్చుండాలే?'' అడిగాడు.

ఆమె ఇంకా కోపంతో చూస్తూ ''అంటే ఒక్కరే కాదన్నమాట. బయట కృష్ణలీలలు నడుపుతున్నారన్నమాట'' అంది.

షూ వేసుకుంటూ ''అసలు జరిగింది వింటే నీ కోపం చిటికెలో ఎగిరిపోతుంది'' అంటూ ఆమె వినకపోయినా చెప్పటం ప్రారంభించాడు సుబ్రమణ్యం.

''నా ఉద్యోగం తెలిసి కూడా నువ్విలా కోప్పడటంలో అర్థం లేదు సుశీ. ఈ వారం మా పత్రికలో 'లవ్ లెటర్స్' శీర్షిక కొత్తగా ప్రారంభించాం. దానికి వచ్చిన లెటర్స్‌లో ఈ రెండూ ఫైనల్ అయ్యాయి. దీంట్లో దేనికి మొదటి బహుమతి ఇవ్వాలా... అన్న కన్‌ఫ్యూజన్ నీ వల్ల తొలగిపోయిందిలే'' అన్నాడు.

దానితో సుశీల బుంగమూతిని కాస్త బుజ్జిమూతిని చేస్తూ బెడ్‌మీద మిస్సయిన కిస్‌ని అందించి ఆఫీసుకి పంపింది సుబ్రమణ్యంని. ''కానీ ఇలాంటి లెటర్స్‌ని ఇకమీద ఇంటికి దయచేసి తీసుకురాకండి'' నెమ్మదిగా మందలించింది.

బయటపడ్డ సుబ్రమణ్యం బండి స్టార్ట్ చేస్తూ 'నా పత్రిక ఉద్యోగం నన్ను బ్రతికించిందిగా. నిజంగా సుకన్య విషయం సుశీలకి తెలిస్తే ఎన్ని తంటాలో. ఇలాంటి లెటర్స్‌తో జాగ్రత్తగా ఉండాలి' అనుకున్నాడు మనసులో.

**-పుట్రేవు శ్రీనివాసరావు (హైదరాబాద్)**